
సాక్షి ఒడిశా

మంగళవారం । 28 । నవంబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు రూ.7,26,562
బంగారం 1 గ్రాము 570 మిల్లీ గ్రాములు
వెండి 150 గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



కార్తీక శోభ

కార్తీక మాసం చివరి సోమవారం అంతటా ఆధ్యాత్మిక శోభ నెలకొంది.

- 8లో



స్వాగత ద్వారం ప్రారంభం

జయపురం నగరానికి దక్షిణ వైపునున్న బమిణి గాం వద్ద ఏర్పాటు చేసిన స్వాగత ద్వారం సోమవారం ప్రారంభించారు.

- 8లో

న్యూస్‌రీల్

ప్రమాదవశాత్తు గోతిలో పడిన చిన్నారి



గోతిలో ఇరుక్కుపోయిన బాలిక



బాలికను బయటకు తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

మల్కన్‌గిరి: జిల్లాలోని మత్తిలి సమితి ఇందిరా నగర్ కాలనీలో 8 ఏళ్ల చిన్నారి మమతా గౌడ్ తోటి పిల్లలతో ఆడుకుంటూ గోతిలో పడిపోయిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. సోమవారం స్కూల్స్ సెలవు కావడంతో సానియా గౌడ్ కుమార్తె మమతా గౌడ్ తోటి పిల్లలతో ఆడుకుంది. ఈ సందర్భంగా ప్రమాదవశాత్తు అనుకోకుండా రెండు రోజుల క్రితం కరెంట్ స్తంభాల కోసం తీసిన గోతిలో పడిపోయింది. దీంతో తోటి పిల్లలు కేకలు వేయగా తల్లిదండ్రులతో పాటు గ్రామస్తులంతా వచ్చి బయటకు తీసేందుకు ప్రయత్నం చేశారు. కానీ వారు బయటకు తీయలేకపోవడంతో మత్తిలి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అనంతరం అగ్నిమాపక సిబ్బంది వచ్చి గోతిని వెడల్పు చేసి బాలికను రక్షించారు. దీంతో తల్లిదండ్రులు, గ్రామస్తులు ఊపిరిపీల్చుకున్నారు.

యాంటీ ర్యాగింగ్ కమిటీలు ఏర్పాటు చేయాలి

- ఎస్పీ సర్వాణ్ వివేక్



మాట్లాడుతున్న ఎస్పీ సర్వాణ్ వివేక్

బరంపురం: నగరంలోని ప్రతీ కళాశాలలో యాంటీ ర్యాగింగ్ కమిటీలు ఏర్పాటు చేయాలని బరంపురం ఎస్పీ సర్వాణ్ వివేక్ కోరారు. స్థానిక ఎస్పీ కార్యాలయ సమావేశ మందిరంలో నగరంలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాల్స్‌తో సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కళాశాలల్లో జరుగుతున్న ర్యాగింగ్‌ల దృష్ట్యా కమిటీలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కమిటీల్లో విద్యార్థుల తల్లిదండ్రులను చేర్చుకోవాలని సూచించారు. ర్యాగింగ్‌పై చట్టపరమైన చర్యలు తప్పవని తెలియజేశారు. సమావేశంలో ప్రిన్సిపాల్స్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భార్యపై భర్త గొడ్డలితో దాడి



చికిత్స పొందుతున్న కకోలి మండాల్

మల్కన్‌గిరి: జిల్లాలోని మల్కన్‌గిరి సమితి ఎంవీ 15 గ్రామంలో భార్యపై భర్త గొడ్డలితో దాడి చేసిన ఘటన సంచలనం సృష్టించింది. వివరాల్లోకి వెళ్తే.. ఎంవీ 15 గ్రామానికి చెందిన కైలాస్ చౌదరికి, మల్కన్‌గిరికి చెందిన కకోలి మండాల్‌తో 2006లో వివాహం జరిపారు. కొద్ది రోజులు జీవనం బాగానే సాగింది. అక్కడ నుంచి ఇద్దరి మధ్య తరుచూ గొడవలు జరుగుతూ ఉండేవి. భార్య మీద అనుమానంతో ఆమెను నిత్యం కొట్టేవాడు. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో అందరూ నిద్రపోతున్న సమయంలో గొడ్డలితో ఆమెపై దాడి చేశాడు. దీంతో కేకలు వేస్తూ ఆమె బయటకు పరుగులు తీసింది. వెంటనే కైలాస్ పరారయ్యాడు. గ్రామస్తులంతా కలిసి కకోలిని మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. పోలీసులు కైలాస్‌పై కేసు నమోదు చేసి గాలిస్తున్నారు.

తీరం.. భక్తజన హారం



గోపాల్‌పూర్ తీరంలో భానోదయం



భానుడికి హారతిలిస్తున్న భక్తులు

కార్తీక పౌర్ణమి సందర్భంగా గోపాల్‌పూర్ తీరం భక్తులతో సోమవారం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. బరంపురం నగరం, చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాదిమంది భక్తులు తీరానికి చేరుకొని సముద్రంలో పౌర్ణమి స్నానాలాచరించారు. అరటి దవ్వలతో చేసిన పడవల్లో దీపాలు వెలిగించి సూర్యోదయ సమయంలో సముద్రంలో విడిచిపెట్టి భక్తిపారవశ్యంతో సూర్య నమస్కారాలు చేశారు. తీరంలో ఇసుకతో సంప్రదాయం ప్రకారం చిన్న చిన్న ఆలయాలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అప్పుడే ఉదయిస్తున్న భానుడికి హారతులిచ్చి ఆశీర్వచనాలు పొందారు. అలాగే గోపాల్‌పూర్ తీరంలో గంజాం హోటల్ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన బోయిత బందన ఉత్సవాలు ఘనంగా జరిపారు. స్థానిక కళాకారులు సాంస్కృతిక, అధునిక, సంప్రదాయ నృత్యాలు చేసి సందర్శకులను ఆకట్టుకున్నారు. – బరంపురం



పౌర్ణమి స్నానాలాచరిస్తున్న భక్తజనం



అరటి దవ్వలతో చేసిన పడవలకు పూజలు



అరటి దవ్వల పడవలను సముద్రంలో వదులుతున్న భక్తులు

కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలి

- బీజేడీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు నెక్కంటి
- కార్యకర్తలకు దిశా నిర్దేశం

రాయగడ: రానున్న ఎన్నికలు పార్టీకి ఎంతో కీలకమని, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని బీజేడీ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు, రాజ్యసభ మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావు పిలుపునిచ్చారు. స్థానిక రాణిగుడఫాంలోని ఆయన నివాసంలో సమితి సభ్యులు, సర్పంచ్‌లతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్పంచ్‌లు, సమితి సభ్యులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఎంతో నమ్మకంతో గెలిపించిన ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయకూడదన్నారు. పార్టీ విజయానికి సోపానాలైన వివిధ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా కృషి చేయాలన్నారు. అదేవిధంగా తమ పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని హితవుపలికారు. పంచాయతీల స్థాయిలో తరచూ సమావేశాలు నిర్వహించాలన్నారు.

సైనికుల్లా పనిచేయాలి

సార్వత్రిక ఎన్నికల కోసం నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాల్సిన తరుణం ఆసన్నమైందని నెక్కంటి స్పష్టం చేశారు. గ్రామస్థాయి నుంచి బూత్ కమిటీలు ఏర్పాటు చేసి కార్యకర్తలు పనిచేయాల్సి ఉంటుందన్నారు. గత ఎన్నికల్లో రాయగడ శాసన సభ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థి



మాట్లాడుతున్న రంజిత్ రాయ్, పక్కనే నెక్కంటి

విజయం సాధించడానికి పార్టీలో లుకలుకలే కారణమని ఆవేదన వ్యక్తం చేశారు. వివాదాలకు స్వస్థిపలికి నిస్వార్థంగా పనిచేస్తే ఈసారి విజయం తథ్యమని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా పార్టీ అధిష్టానం ఎవరికి టిక్కెట్టు కేటాయిస్తే వారి విజయానికి అంతా కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈసారి గెలిచి తీరాలి

ఏదిఏమైనప్పటికీ ఈసారి జరగనున్న ఎన్నికల్లో అత్యంత కీలకంగా మారిన రాయగడ శాసనసభ నియోజకవర్గం నుంచి బీజేడీ అభ్యర్థి గెలిచితీరాలని రాయగడ శాసనసభ నియోజకవర్గానికి సంబంధించి ఎన్నికల పరిశీలకునిగా వచ్చిన రంజిత్ రాయ్ అన్నారు. జిల్లాలో బిసంకటక్, గుణుపూర్, రాయగడ నియోజకవర్గాలతో పాటు కొరాపుట్ లోక్‌సభ స్థానం కూడా బీజేడీ కైవసం చేసుకుంటుందన్నారు. సమావేశంలో రాయగడ సమితి అధ్యక్షురాలు టున్ని హుయిక, సర్పంచ్ తమ్మారావు బిడిక తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న సర్పంచ్‌లు, సమితి సభ్యులు, కార్యకర్తలు

జస్టిస్ శివశంకర మిశ్రాకు ఘన సన్మానం



హైకోర్టు జడ్జి శివశంకర మిశ్రాకు సైనిక వందనంతో స్వాగతం

జయపురం: ఒడిశా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శివశంకర మిశ్రాను కొరాపుట్ జిల్లా బార్ అసోసియేషన్ జయపురం సభ్యులు జిల్లాకోర్టు ఆవరణలో ఘనంగా సన్మానించారు. జయపురానికి చెందిన ఆయన హైకోర్టు న్యాయమూర్తి అయ్యాక మొదటిసారిగా ఆదివారం విచ్చేయడంతో జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బిరేష్ పట్నాయక్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో జిల్లా జడ్జి సత్యనారాయణ మిశ్ర, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు పి.రమేష్ పాత్రో, అసోసియేషన్ కార్యదర్శి శరత్ కుమార్ మరీధ్, న్యాయవాదులు డాక్టర్ బి.గాయిత్రీ దేవి, హేమంత్ కుమార్ షాడంగి, బిజయ మబ కుమార్ రాయ్‌జెన, ప్రమోద్ కుమార్ దాస్ తదితరులు పాల్గొన్నారు.



జస్టిస్ శివశంకర్ మిశ్రాను సన్మానిస్తున్న న్యాయవాదులు

అదరహో...!



నృత్యం చేస్తున్న శివ భక్తులు



కాళీమాతను శాంతింపజేస్తున్న త్రినేత్రుడు



శివతాండవంలో త్రినేత్రుడిగా ఆకట్టుకున్న జగన్నాథ్ మాస్టర్



కార్యక్రమంలో పాల్గొన్న ఇందిరా పట్నాయిక్, సంజుక్తా బెహరా తదితరులు

స్థానిక జగన్నాథ మందిర ప్రాంగణం వద్ద కార్తీక పౌర్ణమి సందర్భంగా 'కార్తీక భక్తి సంధ్య' అనే సాంస్కృతిక, సంగీత కార్యక్రమాలు హైటెక్ విద్యాసంస్థల ఛైర్మన్ డా.తిరుపతి పాణిగ్రాహి, తనయుడు రూపేష్ పాణిగ్రాహి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి అత్యద్భుతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారుల శివతాండవం, మహాంకాళి ఉగ్రరూపం చూపరులను ఆకట్టుకున్నాయి. అనంతరం నిర్వహించిన సంగీత విభావరి శ్రోతలను అలరింపజేసింది. కార్యక్రమంలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. – పర్లాకిమిడి



కోమలాంగిని సన్మానిస్తున్న దృశ్యం



శివ తాండవం నృత్యం ప్రదర్శిస్తున్న కళాకారులు

క్లుప్తంగా

రాజ్యాంగ పీఠికే స్ఫూర్తి

శ్రీకాకుళం పాతబస్టాండ్: భారత రాజ్యాంగ పీఠికను స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా సోమవారం జిల్లా కేంద్ర కార్యాలయంలో న్యాయాధికారులు, న్యాయశాఖ ఉద్యోగులతో రాజ్యాంగంలోని పీఠికను చదివించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంలో పొందుపరిచిన అంశాలపై అవగాహన పెంచుకొని నిబద్ధతతో మెలగాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి శ్రీదేవి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు, మెజిస్ట్రేట్లు కందికట్ల రాణిశ్రీ, భరణి పాల్గొన్నారు.

బధిర విద్యార్థులకు ట్యాబ్‌లు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో సహిత విద్య అభ్యసిస్తున్న సహిత విద్యార్థులకు కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ట్యాబ్‌లు అందజేశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో వినికిడి లోపంతో ఇబ్బంది పడుతున్న 160 మంది చిన్నారులకు వీటిని పంపిణీ చేశారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, సర్వ శిక్ష అభియాన్ ఏపీసీ జయప్రకాశ్, జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బెజ్జిపురం యూత్ క్లబ్‌కు ప్రశంసలు



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న బెజ్జిపురం యూత్ క్లబ్ వ్యవస్థాపకుడు ప్రసాదరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రధాన మంత్రి మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని మోదీ బెజ్జిపురం యూత్ క్లబ్‌ను ప్రశంసించడం అభినందనీయమని, మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించి జిల్లాకి మంచి గుర్తింపు తేవాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందనలో బెజ్జిపుం యూత్ క్లబ్ వ్యవస్థాపకుడు ప్రసాదరావు కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాని కార్యాలయం కోరిన వెంటనే 1996 నుంచి బెజ్జిపురం యూత్ క్లబ్ సేవల వివరాలను అందజేసినట్లు తెలిపారు.ఇదే స్ఫూర్తి కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పారా లీగల్ వలంటీర్లకు ఐడీ కార్డులు



ఐడీ కార్డులు అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో పారా లీగల్ వలంటీర్లకు ఐడీ కార్డులను జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు జునైద్ అహ్మద్ మౌలానా సోమవారం అందజేశారు. ఐదు రోజుల శిక్షణ పూర్తయిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐడీ కార్డులను దుర్వినియోగం చేయకుండా న్యాయ సేవాధికార సంస్థ ప్రతిష్టను దృష్టిలో పెట్టుకొని ఉచితంగా న్యాయ సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ సంరక్షణాధికారి ఎం.మల్లేశ్వరరావు, లీగల్ కం ప్రొహిబిషన్ ఆఫీసర్ తలే లక్ష్మణరావు, గార తహసీల్దార్ జన్ని రామారావు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు, న్యాయవాది అన్నెపు భువనేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న ఆదాయం రూ.6,76,695

టెక్కలి: కార్తీక మాసం రెండో సోమవారం సందర్భంగా టెక్కలి మండలం రావివలస ఎండల మల్లికార్జునస్వామి దేవస్థానానికి రూ. 6,76,695 ఆదాయం వచ్చినట్లు ఉత్సవాల ప్రత్యేకాధికారి వి.వి.ఎస్.నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. శీఘ్రదర్శనం టికెట్ల ద్వారా రూ.2,25,000, శీర్షాభిషేకం టికెట్ల ద్వారా రూ.2,90,000, కేశ ఖండన టికెట్ల ద్వారా రూ.14,000, హుండీల ద్వారా రూ.1,47,695 ఆదాయం వచ్చినట్లు వివరించారు. గత ఏడాది కంటే ఈ ఏడాది రూ. 42,541 అదనపు ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు.

అర్హులందరికీ ఓటు హక్కు

రణస్థలం: క్షేత్ర స్థాయిలో పర్యటించి సమగ్ర ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని, అర్హులందరికీ ఓటు హక్కు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఉన్నత విద్య ప్రిన్సిపల్ సెక్రటరీ, రాష్ట్ర ఎన్నికల ఎలక్టోరల్ పరిశీలకుడు జె.శ్యామలరావు సిబ్బందికి సూచించారు. రణస్థలం మండలం కోష్ట గ్రామంలో 182, 183 పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద బీఎల్‌ఓలు రిజిస్టర్‌ను అందుబాటులో ఉంచాలన్నారు. 18 ఏళ్లు నిండిన యువతకు ఓటు హక్కు కల్పించాలని, ఇందుకు ప్రతి కళాశాలలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌డీసీ బి.పద్మావతి, ఆర్డీఓ సీహెచ్ రంగయ్య, తహసీల్దార్ సనపల కిరణ్‌కుమార్, ఎన్నికల డీటీ జి.కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

కార్తీక శోభ

- ఘనంగా కార్తీక పౌర్ణమి పూజలు
- వెల్లివిరిసిన ఆధ్యాత్మికత



జయపురం: గుప్తేశ్వర్‌లో శివలింగానికి పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

కార్తీక మాసం చివరి సోమవారం రాష్ట్రమంతటా ఆధ్యాత్మిక శోభ నెలకొంది. భక్తులంతా పౌర్ణమి పూజలను వైభవంగా నిర్వహించారు. వేకువజాము నుంచే ప్రజలు తమకు సమీపంలో ఉన్నటువంటి నదులు, చెరువుల వద్దకు చేరుకొని దీపాలతో కూడిన పడవలను విడిచిపెట్టారు. అనంతరం ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలుచోట్ల సహపంక్తి, సామూహిక దీపారాధనలు ఏర్పాటు చేశారు. – సాక్షి నెట్‌వర్క్



జయపురం: బొయిత బందన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తారాప్రసాద్



కొరాపుట్: బొత్ర చివుని గ్రామంలో కిటకిటలాడుతున్న శైవక్షేత్రం



జయపురం: జగన్నాథ మందిరం వద్ద భక్తుల కోలాహలం



రాయగడ: నదిలో పడవలు విడిచిపెడుతున్న మహిళలు



కొరాపుట్: మహదేవుడిని దర్శించుకుంటున్న ఎంపీ సప్తగిరి ఉల్క కుటుంబం



జయపురం: జలాశయంలో కార్తీక దీపాలు వదులుతున్న భక్తులు



రాయగడ: జంఝావతి నదీతీరంలో మహిళలు



జయపురం: కార్తీక దీపాలు వదులుతున్న మహిళలు



పర్లాకిమిడి: పెద్దబ్రాహ్మణ వీధిలో పూజలందుకుంటున్న కార్తికేయుడు



జయపురం: ఒడిస్సీ నృత్యం చేస్తున్న కళాకారులు



కొరాపుట్: ఉమ్మర్ కోట్ అష్ట ప్రహరీలో నబరంగ్‌పూర్ ఎంపీ రమేష్ చంద్ర మజ్జి



రాయగడ: మల్లికార్జున మందిరంలో భక్తుల సందడి



కొరాపుట్: భక్తులతో కిక్కిరిసిన నబరంగ్‌పూర్ జగన్నాథ మందిరం



జయపురం: చెరువు వద్ద కార్తీక పూజలు చేస్తున్న భక్తులు



రాయగడ: జగన్నాథ మందిరంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



జయపురం: కుచైయిపాదర్‌లో శివ లింగాలకు విశిష్ట పూజలు

‘పల్లెగూటికి పండగొచ్చింది’ సినిమాను ఆదరించాలి

శ్రీకాకుళం అర్బన్: పల్లెగూటికి పండగొచ్చింది సినిమాను ప్రతి ఒక్కరూ చూసి ఆదరించాలని ప్రముఖ సినీ నటుడు సుమన్ కోరారు. సినిమా ప్రీ రిలీజ్ ఫంక్షన్‌ను శ్రీకాకుళంలోని ఎస్ కన్వెన్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ పల్లెటూరుకి పండగ వచ్చింది సినిమా సమాజానికి సందేశం ఇచ్చే చిత్రమని చెప్పారు. దర్శకుడు కంచరాన తిరుమలరావు చెప్పిన కథ నచ్చి ఇందులో నటించినట్లు తెలిపారు. దర్శకుడు, నిర్మాత కంచరాన తిరుమలరావు మాట్లాడుతూ డిసెంబర్ 1న ఆంధ్రా, తెలంగాణా రాష్ట్రాల వ్యాప్తంగా చిత్రం విడుదల చేస్తున్నట్లు చెప్పారు. సినిమాలో శ్రీకాకుళం జిల్లాకు చెందిన పలువురు నటించారని తెలిపారు. అనంతరం జబర్దస్త్ దుర్గారావు డ్యాన్స్‌తో అలరించారు.



మాట్లాడుతున్న సుమన్

కార్యక్రమంలోనటులు రవితేజ, లవకిషన్, మురళీధర్, రోహిత్ కృష్ణ, నిగతాభాస్, జూనియర్ కృష్ణ, కె.ప్రసాద్, అమ్మ రామకృష్ణ, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, సనపల అన్నాజీరావు, దుప్పల వెంకటరావు, డీపీ దేవ్, మొదలవలస రమేష్, పీఎంజే బాబు, చింతాడ రామ్మోహన్‌రావు, జె.జె.మోహనరావు, నటుకుల మోహన్, సురంగి మోహన్, పొన్నాడ రవికుమార్, డోల జగన్, శ్రీకాకుళం రంగస్థల కళాకారుల సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ తైక్వాండో పోటీల్లో సత్తాచాటండి



ఎంపికైన క్రీడాకారులతో సాంబమూర్తి, సుందరరావు, కొమర భాస్కర్ తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ స్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లోనూ సత్తాచాటి పతకాలతో తిరిగి రావాలని ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెంటాడ సాంబమూర్తి పిలుపునిచ్చారు. ఉత్తరాఖండ్ రాష్ట్రం డెహ్రాడూన్ వేదికగా డిసెంబర్ 1 నుంచి 3 వరకు జరగనున్న 37వ సబ్-జూనియర్, 6వ క్యాడెట్ జాతీయ స్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్- 2023 పోటీలకు జిల్లా నుంచి తొమ్మిది మంది క్రీడాకారులు ఎంపికైన విషయం తెలిసిందే. సబ్ జూనియర్స్ బాలుర విభాగంలో ఆర్.నరేంద్రనాయుడు, డి.లీలామాధవ్, బాలికల విభాగంలో డి.త్రివేణి, పి.యషిత, బి.దేవీప్రియ, క్యాడేట్స్ బాలుర విభాగంలో కె.మోక్షిత్, టి.ఢిలేశ్వరరావు, ఎ.ప్రశాంత్, బాలికల విభాగంలో ఆర్.తన్మయ్ ఎంపికైన వారిలో ఉన్నారు. వీరంతా సోమవారం ఇక్కడి నుంచి పయనమై వెళ్లారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రాంగణంలో జిల్లా క్రీడాకారుల బృందానికి అతిథులు, సంఘ ప్రతినిధులు వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఒలింపిక్ సంఘం సలహాదారు పి.సుందరరావు మాస్టారు, తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ శ్రీకాకుళం డిస్ట్రిక్ట్ కొమర భాస్కరరావు, డీఆర్‌డీఏ పీడీ డాక్టర్ విద్యాసాగర్, గేదెల ఇందిరాప్రసాద్, ఎస్.ఈశ్వరరావు, జిల్లా ఉషూ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రెడ్డి శివకుమార్, ఇస్కాఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సనపల నరసింహులు, కురుటి తారకరామ, సకుముల శివాజీ, కొమర మోహన్‌కృష్ణ, పాల్గొన్నారు.

● వైభవంగా జ్వాలా తోరణం



బలగ నాగావళి తీరంలో బాలత్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా సోమవారం జ్వాలా తోరణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో జ్వాలా తోరణాన్ని ఏర్పాటు చేయగా.. భక్తులు కోటి వత్తులను ఒకటిగా చేసి వెలిగించారు. – శ్రీకాకుళం కల్చరల్

లారీ చోరీ

టెక్కలి రూరల్: స్థానిక మెళియాపుట్టి రోడ్డులో సోమవారం మధ్యాహ్నం అనకాపల్లికి చెందిన శిల్పరశెట్టి నాగరాజుకు చెందిన లారీ చోరీకి గురైనట్లు టెక్కలి ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్మాణానికి సామగ్రి తీసుకువెళ్లేందుకు ఉపయోగిస్తున్న ఏపీ39టీ 9191 నంబరు గల లారీ మెళియాపుట్టి రోడ్డులో సోమవారం మధ్యాహ్నం పార్కు చేసి ఉంచారు. ఆ సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు లారీని పట్టుకుపోయారు. బాధితుడు పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

జాతీయ పోటీలకు రిఫరీగా మోహన్‌కృష్ణ

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ పోటీలకు రిఫరీగా శ్రీకాకుళం వాసికి అవకాశం లభించింది. ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్ వేదికగా డిసెంబర్ ఒకటి నుంచి మూడు వరకు జరిగే ఆలిండియా సబ్ జూనియర్స్, క్యాడెట్స్ బాలబాలికల తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలకు రిఫరీ(టెక్నికల్ అఫీసియల్)గా జిల్లాకు చెందిన కొమర మోహన్‌కృష్ణ నియామకం అయ్యారు. ఈ మేరకు తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాని కార్యదర్శి ప్రభాత్‌కుమార్ శర్మ నుంచి నియామక ఉత్తర్వులు అందుకున్నారు. ఇప్పటికే పలు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రిఫరీగా వ్యవహరించి ప్రశంసలు అందుకున్న మోహన్‌కృష్ణ నియామకంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

జాబ్‌మేళా రేపు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో ఈ నెల 29న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ ఒక ప్రకటనలో తెలిపారు. టి.సి.ఎస్. కంపెనీలో బీపీఓ, డెక్కన్ కెమికల్స్ కంపెనీలో ట్రైనీ (ప్రొడక్షన్), కోజెంట్ ఈ సర్వీసెస్ కంపెనీలో బీపీఓ, నిట్ ఐ.సి.ఐ.సి.ఐ బ్యాంక్‌లో రిలేషన్‌షిప్ మేనేజర్, ఇసుజు మోటార్స్, సియాన్ కంపెనీల్లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. టెన్త్ నుంచి బి.టెక్ వరకు చదివిన 35 ఏళ్లలోపు వారు అర్హులని తెలిపారు. నెలకు రూ.12,000 నుంచి రూ.25,000 వరకు జీతం, ఇతర అలవెన్సులు ఉంటాయని, ఆసక్తి గల వారు ఉదయం 9 గంటలకు ధ్రువపత్రాలతో చేరుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 9949094968 నంబరును సంప్రదించాలని జేకేసీ కోఆర్డినేటర్ వైమణికుమార్ తెలిపారు.

స్వాగత ద్వారం ప్రారంభం

జయపురం: నగరానికి దక్షిణ వైపునున్న బమిణిగాం వద్ద ఏర్పాటు చేసిన స్వాగత ద్వారం సోమవారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పాల్గున్న జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహినీపతి, జిల్లా స్వతంత్ర్య అభివృద్ధి పరిషత్ చైర్మన్ చంద్రశేఖర మఝిలు ప్రారంభోత్సవం చేసి ప్రజలకు అంకితం చేశారు. జిల్లా స్వతంత్ర్య అభివృద్ధి పరిషత్ సమకూర్చిన రూ.25 లక్షల నిధులతో స్వాగత ద్వారం ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పట్నాయక్ వెల్లడించారు. పట్టణ సుందరీకరణ పథకంలో భాగంగా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అలాగే జయపురం బొరిగుమ్మ 26వ జాతీయ రహదారిలో నేషనల్ హైవే ఇంజినీర్ కార్యాలయం వద్ద మరో ఆదివాసీ స్వాగత తోరణం ఏర్పాటు చేయనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో జయపురం మున్సిపల్ చైర్మన్ నరేంద్రకుమార్ మహంతి, వైస్ చైర్‌పర్సన్ బి.సునీత, కొరాపుట్ కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ ఈశ్వరచంద్ర పాణిగ్రాహి, ఉపాధ్యక్షుడు లక్ష్మీ హంతాల్ తదితరులు పాల్గొన్నారు.



స్వాగత ద్వారం వద్ద నాయకులు, అధికారులు

వైభవంగా వేంకటేశ్వరునికి పూజలు

బరంపురం: కార్తీక మాసం పురస్కరించుకొని స్థానిక వేంకటేశ్వర స్వామి ఆలయంలో నాలుగు రోజులుగా అష్టోత్తర శత సహస్ర నామార్చనలు వైభవంగా జరుగుతున్నాయి. దీనిలో భాగంగా బరంపురం ఎమ్మెల్యే విక్రమ్ కుమార్ పండా మరియు నగర మేయర్ సంఘమిత్ర దొళాయితో పాటు బీఎంసీ కార్పొరేటర్ జె.శ్రీనివాస్‌రావు తదితరులు స్వామి వారిని సోమవారం దర్శించుకున్నారు. గోవింద నామం స్మరిస్తూ శ్రీవారి నిజపాద దర్శనం చేసుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే విక్రమ్ పండా తదితరులు

ఆడుదాం ఆంధ్ర పోస్టర్ ఆవిష్కరణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో ‘ఆడుదాం ఆంధ్ర’ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ‘ఆడుదాం ఆంధ్ర’ వాల్‌పోస్టర్, లోగోలను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 15 నుంచి ఫిబ్రవరి 3 వరకు ఆడుదాం-ఆంధ్రా పేరిట క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ విభాగాలతో పాటు మారథాన్, యోగా, టెన్నికాయట్ పోటీలు జరుగుతాయని చెప్పారు. 15 ఏళ్లు పైబడిన వారంతా ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహిస్తామని తెలిపారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జేసీ తదితరులు

మంత్రి సీదిరికి సత్కారం

కాశీబుగ్గ: రాష్ట్ర పశుసంవర్ధక పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య శాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును జిల్లా పశుసంవర్ధక శాఖ శస్త్రచికిత్సల వైద్యుల బృందం సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పశుసంవర్ధకశాఖ శస్త్రచికిత్సల వైద్యులు కొత్త అసోసియేషన్ ఏర్పాటు చేసిన నేపథ్యంలో పలాసలో మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దువ్వాడ శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి పి.హరికృష్ణ, కోశాధికారి లఖినాన కిరణ్, ఆఫీసర్ అసోషియేషన్ జనరల్ సెక్రటరీ పోతనపల్లి చంద్రశేఖర్, జిల్లా గొర్రెలు, మేకల పెంపకదారుల సహకార సమాఖ్య అధ్యక్షుడు రాపాక చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.



మంత్రితో సంఘ ప్రతినిధులు

క్లుప్తంగా

ఎలుగుబంటి దాడిలో యువకుడి మృతి

- టి.బూర్జవలసలో విషాద ఛాయలు



ఎలుగుబంటి దాడిలో మృతిచెందిన నగేష్

దత్తిరాజేరు: మండలంలోని టి.బూర్జవలస గ్రామానికి చెందిన యువకుడు బానాపురం నగేష్(25) వైజాగ్‌లోని జూపార్క్‌లో ఎలుగు బంటి దాడి చేయడంతో సోమవారం ఉదయం మృతి చెందాడు. ఈ వార్త తెలిసిన వెంటనే గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. నగేష్ ప్రస్తుతం భవానీ దీక్షలో ఉన్నాడు. విశాఖలోని జూలో కీపర్‌గా జౌట్ సోర్సింగ్ పద్ధతిలో కొన్నాళ్లుగా పని చేస్తున్నాడు. విధి నిర్వహణలో ఉండగా ఎలుగు బంటి దాడి చేయడంతో మృతి చెందినట్లు తండ్రి తౌడు కన్నీరు మున్నీరై విలపించాడు. ఈ సమాచారం తెలుసుకున్న గ్రామానికి చెందిన బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు గ్రామస్తులు మృత దేహాన్ని చూసేందుకు వైజాగ్ బయల్దేరి వెళ్లారు.

గ్యాస్ లీకై వృద్ధుడికి గాయాలు

లక్కవరపుకోట: మండలంలోని గొల్జాం గ్రామంలో ఓ ఇంట్లో వంటగ్యాస్ లీక్ అయి చెలరిగిన మంటల వల్ల ఓ వృద్ధుడు గాయాల పాలయ్యాడు. ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఇంట్లో వారంతా వ్యవసాయ పనుల నిమిత్తం పొలంలోకి వెళ్లిపోగా ఇంటి పెద్ద వృద్ధుడు తూర్పాటి సత్యం ఇంటి వద్దే ఉన్నాడు. మధ్యాహ్నం టీ పెట్టుకునేందుకు సత్యం గ్యాస్‌స్టౌ వెలిగించాడు. ఒక్కసారిగా మంటలు చెలరేగి ఇంట్లో ఉన్న సామగ్రి కాలిబూడిద కావడంతో పాటు సత్యం వంటికి నిప్పు అంటుకోగా కేకలు వేశాడు. దీంతో ఇరుగుపొరుగువారు వచ్చి మంటలను అదుపు చేసి సత్యాన్ని కాపాడారు. అనంతరం బాధితుడిని 108 వాహనంలో ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించారు. ప్రమాద వార్త తెలిసిన వెంటనే తహసీల్దార్ కల్యాణ చక్రవర్తి సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి వెళ్లి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

పాలకొండ రూరల్: మండలంలోని అన్నవరం గ్రామ సమీపంలో ఆదివారం ద్విచక్ర వాహన్ని లారీ ఢీకొట్టడంతో జరిగిన ప్రమాదంలో మరో వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ప్రమాదం జరిగిన స్థలంలోనే జడ్డు దుర్గారావు (24) ఆదివారం మరణించిన విషయం విదితమే. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన వాహనచోదకుడు కడగల నరేష్ (19)ను విశాఖ తరలించగా ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ సోమవారం మరణించాడు. మృతుడి తండ్రి ఆదినారాయణ ఇదివరకే మరణించగా తల్లి లక్ష్మి ఉంది.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

విజయనగరం క్రైమ్: పట్టణంలోని ఫూల్‌బాగ్ కాలనీలో నివాసం ఉంటున్న కార్పెంటర్ నల్ల పాటి రమేష్ (32) ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం అర్ధరాత్రి జరిగిన ఈ సంఘటనపై టూటౌన్ పోలీసులు సోమవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తనకు పెళ్లికావడం లేదని మనస్తాపం చెందిన రమేష్ ఇంట్లో ఉన్న దూలానికి నైలాన్‌తాడుతో ఉరివేసుకున్నాడు.

భర్త, అత్తమామలకు జైలు, జరిమానా

తెర్లాం: పెళ్లికి ముందు సోకిన వ్యాధిని దాచిపెట్టడమే కాకుండా, అదనపు కట్నం కోసం వేధిస్తున్న అత్తమామలు, భర్తకు బొబ్బిలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సరోజినమ్మ ఏడాది జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని టెక్కలి వలసకు చెందిన వసంతకుమారికి గుడ్ల బాబ్జీతో వివాహమైంది. పెళ్లి సమయంలో తనకున్న వ్యాధిని బాబ్జీ చెప్పకుండా దాచిపెట్టడంతోపాటు అదనపు కట్నం కోసం అత్తమామలు వేధిస్తుండడంతో మనస్తాపం చెందిన వసంతకుమారి తెర్లాం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు బొబ్బిలి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పునిచ్చారు.

శివాలయంలో చోరీ

రాజాం సిటీ: మండల పరిధి శ్రీకాకుళం రోడ్డులోని మొగిలివలస జంక్షన్ వద్ద ఉన్న కాశీవిశ్వేశ్వర ఆలయంలో చోరీ జరిగింది. ఎస్సై వీబీ రామకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆలయ ప్రధాన ద్వారం తాళాలు పగులగొట్టి లోపల ఉన్న హుండీని గునపంతో తెరిచి అందులో ఉన్న నగదు అపహరించుకుపోయారు. యథావిధిగా కార్తీకమాసం పూజల నిమిత్తం వేకువజామున ఆలయానికి వచ్చిన అర్చకుడు వంశీ దొంగతనం జరిగినట్లు గమనించి గ్రామస్తులకు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు పోలీసులకు సమాచారం అందించడంతో ఆలయానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం క్లూస్ టీమ్‌కు సమాచారం ఇవ్వగా వారు వచ్చి హుండీ, గేటు, తాళంపై ఉన్న వేలిముద్రలను సేకరించారు. హుండీలోని డబ్బులు సుమారు రూ. 15వేలు అపహరణకు గురై ఉండవచ్చునని ఆలయకమిటీ సభ్యుడు గణనాథ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

అర్జీలు పరిష్కరించి ఆన్‌లైన్ చేయాలి

- జగనన్నకు చెబుదాం వినతులపై కలెక్టర్ ఆదేశాలు



అర్జీదారుల వినతులను వింటున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన వినతులు పూర్తిస్థాయిలో పరిష్కరించిన తరువాతనే ఆన్‌లైన్‌లో పరిష్కారమైనట్లు చూపాలని అసంపూర్తి నివేదికలను ఇవ్వొద్దని కలెక్టర్ నాగలక్ష్మి జిల్లా అధికారులను ఆదేశించారు. ఒకసారి పరిష్కరించినట్లు చూపిన వినతులను మళ్లీ తెరిచే పరిస్థితి రాకుండా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. అధిక సంఖ్యలో వినతులు వస్తున్న ప్రభుత్వశాఖలు తమకు అందుతున్న వినతులను పెండింగ్‌లో పెట్టకుండా త్వరగా పరిష్కరించాలని సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఆమె జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్‌డీ అనితలతో కలిసి 165 వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో డీపీఎం రాజేశ్వరి, ఎస్‌డీసీలు సుదర్శన దొర, సుమబాల, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదుదారులకు తక్షణ న్యాయం

విజయనగరం క్రైమ్: ఫిర్యాదుదారుల సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు చేపట్టి, వారికి చట్టపరిధిలో న్యాయం చేయాలని పోలీస్ అధికారులను ఎస్పీ ఎం.దీపిక ఆదేశించారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఆమె స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి 42 ఫిర్యాదులను స్వీకరించి, సమస్యలను తెలుసుకుని, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. స్పందన ఫిర్యాదులపై విచారణ చేపట్టి, ఏడు పనిదినాల్లో సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, దిశ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఎస్బీ సీఐ కేకేవీ.విజయనాథ్, డీసీఆర్‌బీ ఎస్సైలు వాసుదేవ్, ప్రభావతి, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ ఎం.దీపిక



వినతులను స్వీకరిస్తున్న జేసీ గోవిందరావు

సమస్యలకు సంతృప్తికర పరిష్కారం

పార్వతీపురం: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజలు తెలియజేసిన సమస్యలకు అధికారులు సంతృప్తికర పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సి.విష్ణుచరణ్, కేఆర్‌సీసీ డిప్యూటీ కలెక్టర్ కేశవనాయుడుతో కలిసి ప్రజల నుంచి 136 వినతులు స్వీకరించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజలు తెలియజేసిన సమస్యల గురించి సంబంధిత జిల్లా, మండల అధికారులతో నేరుగా మాట్లాడి సమస్యల పరిష్కారానికి ఆదేశాలు జారీచేశారు. అర్జీలపై సకాలంలో స్పందించి, చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి బి.జగన్నాథరావు, డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ, జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్ పాల్, జిల్లా పౌర సరఫరాల అధికారి సూర్యారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు కలెక్టర్ అభినందన





క్రీడాకారులను అభినందిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం: వివిధ రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో జిల్లా తరఫున పాల్గొని విజేతలుగా నిలిచిన పలువురు క్రీడాకారులను కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి సోమవారం అభినందించారు. జాతీయస్థాయి క్రీడల్లో విజేతలుగా నిలిచిన పలువురు క్రీడాకారులు కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారు సాధించిన విజయాలను గురించి కలెక్టర్ తెలుసుకుని వారిని అభినందిస్తూ జిల్లా ఖ్యాతిని ఇనుమడింపచేయడంలో వారి కృషిని ప్రశంసించారు. రానున్న రోజుల్లోనూ మంచి క్రీడాకారులుగా రాణించి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

కలెక్టర్‌ను కలిసిన క్రీడాకారులు వీరే..

గోవాలో ఇటీవల ముగిసిన జాతీయ క్రీడల్లో స్కే మార్షల్ ఆర్ట్స్‌లో రాష్ట్రం తరఫున పాల్గొని కాంస్య పతకం సాధించిన ములగపాక అంజనీప్రసాద్ తన తండ్రి, కోచ్ ఎం.శ్రీనివాసరావుతో పాటు కలెక్టర్‌ను కలిశారు. శ్రీలంకలో వచ్చే జనవరిలో జరిగే ఆసియా క్రీడల్లో పాల్గొనే జట్టుకు తాను ఎంపికైనట్లు కలెక్టర్‌కు వివరించారు. జాతీయ క్రీడల్లో రాష్ట్రానికి చెందిన ముగ్గురు క్రీడాకారులకు పతకాలు లభించగా అందులో కొత్తవలసకు చెందిన ములగపాక అంజనీప్రసాద్ ఒకరని కోచ్ తెలిపారు. అలాగే రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో రెండో స్థానంలో నిలిచి జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్న రాష్ట్ర జట్టుకు ఎంపికైన కొప్పెర్లలోని డా.బీఆర్.అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకులం విద్యార్థులు కూడా కలెక్టర్‌ను కలిశారు. కొప్పెర్ల గురుకుల పాఠశాల జట్టులోని బి.శ్రావణ్ కుమార్, ఎ.అజయ్ రాజులు అండర్-19 జాతీయ జట్టుకు ఎంపికయ్యారు. అలాగే నగరంలోని నాగవంశం వీధికి చెందిన కనకల శ్రావణ్ కుమార్ జాతీయ హ్యాండ్‌బాల్ జూనియర్ జట్టుకు ఎంపికయ్యారు. సెట్విజ్ సీఈఓ రాంగోపాల్ క్రీడాకారులతో పాటు ఉన్నారు.

ముగిసిన అంతర్ జిల్లా విలువిద్య పోటీలు



విజేతలైన క్రీడాకారులతో ఉన్నతాధికారులు వివిధ జిల్లా కోచ్‌లు

సీతానగరం: మండలంలోని జోగింపేటలో గల డాక్టర్ బీర్ అంబేడ్కర్,గిరిజన, కేజీబీవీ విద్యాలయ సముదాయంలో కలెక్టర్ నిషాంత్‌కుమార్ సూచనల మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి ప్రేమ్‌కు మార్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరుగుతున్న అండర్ 14,17, అండర్ 19 విభాగాల విలువిద్య (ఆర్చరీ) పోటీలు సోమవారం ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్ గోవిందరావు పాల్గొని మాట్లాడుతూ పాఠశాల విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించే లక్ష్యంతో అంతర్‌జిల్లా స్థాయి పోటీలను నిర్వహించినట్లు ఇక్కడ తెలియజేశారు. 13 జిల్లాల నుంచి 600 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొనగా గెలుపొందిన వారికి మూడు రకాల మెడల్స్‌తో పాటు ప్రశంసాపత్రాలను ఆయన అందజేశారు. అలాగే పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులందరికీ ప్రశంసాపత్రాలను అందజేశారు. మూడు రోజుల పాటు క్రీడాకారులకు అన్ని విధాలుగా సహకరించిన నిర్వాహకులు, ఇతర జిల్లాల కోచ్‌లను, పీడీలు, పీఈటీలను కార్యక్రమంలో పాల్గొన్న డీఈఓ ప్రేమ్‌కుమార్ జ్ఞాపికలతో సత్కరించారు.

పార్వతీపురంలో చైన్‌స్నాచింగ్

పార్వతీపురంటౌన్: పట్టణంలో జరిగిన చైన్‌స్నాచింగ్ సోమవారం కలకలం రేపింది. స్థానిక జనశక్తి కాలనీకి చెందిన కోణాల వరలక్ష్మి ఉదయం 5గంటల సమయంలో ఇంట్లోని చెత్తను పారవేసేందుకు బయటకు రాగా ముఖానికి మాస్కు వేసుకున్న ఒక దుండగుడు ఆమె మెడలో ఉన్న రెండు తులాల పుస్తెలతాడు లాక్కుని పరారయ్యాడు. ఈ మేరకు బాధితురాలు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఐ పీవీవీఎస్ఎన్ కృష్ణారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాణం పోస్తున్న 108

- ఏటా వేలాది మందికి సత్వర సేవలు
- సంతృప్తి వ్యక్తం చేస్తున్న బాధితులు

విజయనగరం ఫోర్ట్: జిల్లాలోని 108 అంబులెన్సులు ఎంతో మందికి ప్రాణం పోస్తూ వాటికి ఉన్న అపర సంజీవని పేరును సార్థకం చేసుకుంటున్నాయి. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని సకాలంలో ఆస్పత్రికి చేర్చి పునర్జన్మ ప్రసాదిస్తున్నాయి. ఆపద జరిగిందని ఫోన్ వచ్చిన క్షణాల్లో సంఘటన స్థలంలో 108 అంబులెన్సు వాలిపోయి బాధితులను ఆస్పత్రికి తరలిస్తోంది. గత ప్రభుత్వం హయాంలో 108 అంబులెన్సులను పట్టించుకోకుండా గాలికి వదిలేయడంతో శిథిలావస్థకు చేరినప్పటికీ స్పందించలేదు. దీంతో సేవలకు అంతరాయం కలగడం వల్ల ప్రైవేట్ వాహనాల్లో రోగులను ఆస్పత్రికి తరలించేవారు. అయితే జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 108 అంబులెన్సులకు పూర్వ వైభవం తీసుకొచ్చింది. అంతేకాకుండా శిథిలావస్థలో ఉన్న వాహనాలన్నింటినీ పూర్తిగా మార్చివేసి అత్యాధునిక సౌకర్యాలతో కూడిన అంబులెన్సులను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఆస్పత్రికి చేరేలోపే రోగులకు అంబులెన్స్‌లో చికిత్స అందించడంతో అనేక మంది పునర్జన్మ పొందుతున్నారు. జిల్లాలో 108 అంబులెన్సులు 28 ఉన్నాయి. వాటిలో రెండు అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్ అంబులెన్సులు. ఒకటి నవజాత శిశువులకు సేవలు అందించే నియోనేటల్ అంబులెన్సు. మరో 25 లైఫ్ సపోర్టు అంబులెన్సులు.

15 నిమిషాల్లో సంఘటన స్థలంలో వాహనం

ఆపదలో ఉన్నామని ఫోన్‌రాగానే కుయ్‌కుయ్ మంటూ 108 అంబులెన్సు పట్టణ ప్రాంతంలో 15 నుంచి 16 నిమిషాల్లో సంఘటనా స్థలానికి చేరుకుంటుండగా గ్రామీణ ప్రాంతాలకు 20 నుంచి 22 నిమిషాల్లో చేరుకుంటోంది. సకాలంలో బాధితులను ఆస్పత్రికి చేర్చడం వల్ల ఎంతో మంది ప్రాణాపాయస్థితి నుంచి బయట పడుతున్నారు. కొద్ది రోజుల క్రితం జరిగిన కొత్తవలస మండలంలోని కంటకాపల్లిలో జరిగిన రైలు ప్రమాదంలో గాయపడిన వారిని ఆస్పత్రులకు చేర్చడంలో 108 సిబ్బంది విరామం లేకుండా పనిచేశారు.



108లో మహిళకు ప్రసవం చేసిన సిబ్బంది

సకాలంలో ఆస్పత్రికి



రోడ్డు ప్రమాదంలో గాయపడిన నన్ను 108 సిబ్బంది సకాలంలో విజయనగరంలోని ఆస్పత్రిలో చేర్చారు. రోడ్డు ప్రమాదంలో నా కాలు విరిగిపోవడంతో ఆపరేషన్ జరిగింది. ప్రస్తుతం పూర్తిగా కోలుకున్నాను.

– ఎం.నాయుడు, రామయ్యపాలెం, జామి మండలం

క్షణాల్లోనే తరలింపు



ఇటీవల కంటకాపల్లి, అలమండ రైల్వే స్టేషన్‌ల మధ్యలో రైలు ప్రమాదం జరిగినప్పుడు గాయపడ్డాను. సంఘటన జరిగిన కొన్ని క్షణాల్లోనే 108 సిబ్బంది అక్కడి నుంచి సర్వజన ఆస్పత్రికి తరలించారు. ఇప్పుడు పూర్తిగా కోలుకున్నాను. 108 అంబులెన్సులను సకాలంలో పంపించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– పీఎల్. నాయుడు, గరివిడి

సకాలంలో వైద్యమందేలా సేవలు



108కు ఫోన్ రాగానే సకాలంలో వాహనాన్ని పంపించి బాధితులను ఆస్పత్రికి తీసుకువెళ్తున్నాం. నవజాత శిశువుల వైద్యం కోసం కూడా ఎక్కువగా నియోనేటల్ అంబులెన్సును వినియోగించుకుంటున్నారు. రోగుల ప్రాణాలు కాపాడాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా సకాలంలో సేవలు అందిస్తున్నాం.

– నజీర్ హుస్సేన్, 108 జిల్లా మేనేజర్

నవజాత శిశువులకు ప్రత్యేక అంబులెన్సులు

దేశంలో ఎక్కడా లేనివిధంగా నవజాత శిశువుల కోసం ప్రత్యేకంగా నియోనేటల్ అంబులెన్సును ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. నవజాత శిశువులను తరలించడానికి ఘోషాఆస్పత్రి వద్ద ఈ అంబులెన్సును ఏర్పాటు చేశారు.

నాలుగేళ్లలో 1,68,716 మందికి సేవలు

2020 నుంచి ఇప్పటి వరకు జిల్లాలోని 108 అంబులెన్సులు 1,68, 716 మందికి సేవలందించాయి. వారిలో 35,255 మంది గర్భిణులు, 7,615 మంది జ్వరపీడితులు, రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన 12, 501 మంది, కోవిడ్ బాధితులు 13, 870 మంది ఉన్నారు. శ్వాసకోశ సంబంధిత వ్యాధి బాధితులు 15,689 మంది, పాముకాటు బాధితులు 4847 మందికి 108 వాహనాల ద్వారా సేవలు పొందారు. అలాగే కడుపునొప్పి, గుండె నొప్పి, సుగర్ వ్యాధిగ్రస్తులు, మూర్ఛ రోగులు, గుండె జబ్బులు, కిడ్నీ వ్యాధి బాధితులు, విషం తాగిన వారు, కోమాలో ఉన్నవారు తదితర కేసులకు సంబంధించి 78,939 మందికి 108 అంబులెన్స్‌లు సేవలు అందించాయి.

కబడ్డీ పోటీలకు మహిళా జట్టు సిద్ధం

- 29 నుంచి కర్నూలు జిల్లాలో పోటీలు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా మహిళా జట్టు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న 70వ సీనియర్స్ మహిళల కబడ్డీ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా జట్టు సిద్ధమైంది. ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో 18 మందిని ప్రాబబుల్స్‌కు ఎంపిక చేయగా..శిక్షణ శిబిరం అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన 12 మంది క్రీడాకారులను తుది జట్టులోకి ఎంపిక చేశారు. తుది జట్టులో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 29, 30 తేదీల్లో డిసెంబర్ 1వ తేదీల్లో కర్నూలు జిల్లాలోని గోనెగండ్లలో జరగబోయే అంతర్ జిల్లాల కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కేవీ.ప్రభావతి తెలిపారు. ఎంపికైన క్రీడాకారులకు వారం రోజుల పాటు నగరంలోని సిటీ క్లబ్‌లో శిక్షణ శిబిరం నిర్వహించినట్లు చెప్పారు. ఎంపికైన క్రీడాకారులు మంగళవారం రాష్ట్ర స్థాయి పోటీలకు పయనమవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు రంగారావు దొర, ఆర్గనైజింగ్ కార్యదర్శి నడిపేన లక్ష్మణరావు, కార్యవర్గ సభ్యుడు బి.శివప్రసాద్ పాల్గొన్నారు.

29న అండర్-19 క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న అండర్-19 స్కూల్ గేమ్స్ బాల, బాలికల క్రికెట్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈనెల 29న నిర్వహించనున్నట్లు అండర్-19 స్కూల్ గేమ్స్ అసోసియేషన్ కార్యదర్శి పీవీఎల్ఎన్ కృష్ణ సోమవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి విజయనగరంలోని రాజీవ్ క్రీడామైదానంలో ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఎంపిక పోటీల్లో 19 సంవత్సరాల లోపు వయస్సు కలిగి ఉండి 8,9,10 తరగతులతో పాటు ఇంటర్మీడియట్ విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నారు. క్రీడాకారులు 2005 జనవరి 1వ తేదీ అనంతరం జన్మించి ఉండాలని స్పష్టం చేశారు. ఆ రోజు జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు త్వరలో జరగనున్న అంతర్ జిల్లాల పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు జిల్లా క్రీడాకారులు



జాతీయపోటీలకు ఎంపికైన క్రీడాకారులతో జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రతినిధులు

విజయనగరం: ఉత్తరాఖండ్ రాష్ట్రం డెహ్రాడూన్‌లో డిసెంబర్ 1వ తేదీ నుంచి 3 వరకు జరగనున్న జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా క్రీడాకారులు సోమవారం పయనమయ్యారు. సబ్ జూనియర్, క్యాడెట్ విభాగాల్లో జరిగే పోటీల్లో జిల్లాకు చెందిన 12 మంది క్రీడాకారులు పాల్గొంటారు. వీరు ఈనెల 18, 19 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలలో గోల్డ్‌మెడల్ సాధించి జాతీయ పోటీలకు అర్హత సాధించారు. జాతీయ పోటీలకు అర్హత సాధించిన వారిలో పునీత్, కుశాల్, సాహిత్య, సంకీర్తన, సాత్విక్, ముఖేష్, నిత్యశ్రీ, చరిష్మా, శృతి, దేవన్, హర్షిని, కమల్‌లు ఉన్నారు. జాతీయ పోటీలకు అర్హత సాధించిన క్రీడాకారులను జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురాన అయ్యలు, సీహెచ్ వేణుగోపాలరావు, కోచ్‌లు గగన్, యశస్విని, చైతన్య, గౌతమ్‌లు అభినందించారు.

జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలకు యశ్వంత్ ఎంపిక



జాతీయ టెన్నిస్ పోటీలకు ఎంపికైన యశ్వంత్

తెర్లాం: జాతీయస్థాయిలో జరుగుతున్న అండర్-14 టెన్నిస్ పోటీలకు తెర్లాం మండలంలోని కూనాయవలస గ్రామానికి చెందిన బొమ్మి యశ్వంత్ ఎంపికయ్యాడు. ఇటీవల కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి టెన్నిస్ పోటీల్లో అండర్-14 బాలుర విభాగంలో యశ్వంత్ అత్యుత్తమ ఆట తీరును కనబరిచాడు. దీంతో రాష్ట్రం తరఫున జాతీయ స్థాయి టెన్నిస్ పోటీల్లో పాల్గొనేందుకు యశ్వంత్‌ను స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఎంపిక చేసింది. బొబ్బిలి ఏఎంసీ చైర్మన్, కూనాయవలస ఎంపీటీసీ బొమ్మి శ్రీనివాసరావు కుమారుడు యశ్వంత్. జాతీయస్థాయిలో జరగనున్న టెన్నిస్ పోటీల్లో అత్యుత్తమ ఆట తీరును కనబరిచి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని యశ్వంత్ కుటుంబసభ్యులు, కూనాయవలస సర్పంచ్ బోడెల విజయబాబు తదితరులు ఆకాంక్షించారు.

కొండవానిపాలెంలో వైద్య శిబిరం

సాక్షి ఎఫెక్ట్...

బొండపల్లి: మండలంలోని దేవుపల్లి పంచాయతీ పరిధి కొండవానిపాలెం గ్రామంలో మలేరియాతో ముగ్గురు వ్యక్తులు బాధపడుతున్నట్లు, వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సాక్షిలో వార్త ప్రచురితం కావడంతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు స్పందించారు. ఈ మేరకు జిల్లా సహాయ మలేరియా వైద్యాధికారి (ఏఎంఒ) డీవీ రమణతో పాటు దేవుపల్లి పీహెచ్‌సీ వైద్యసిబ్బంది గ్రామానికి వచ్చి గ్రామాన్ని ఆనుకుని ఉన్న గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి పనుల కోసం ఏర్పాటు చేసిన క్యాంపు ఆఫీసుల వద్ద పరిసరాలను పరిశీలించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి జ్వరాలతో బాధపడుతున్న వారెవరైనా ఉన్నారా? అని సర్వే నిర్వహించారు. అలాగే గ్రామంతో పాటు ,గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి క్యాంప్‌ఆఫీస్, క్యాంటీన్ చుట్టుపక్కల శానిటేషన్ పనులు నిర్వహించడంతో పాటు, బ్లీచింగ్‌ను చల్లి పారిశుద్ధ్య పనులు చేపట్టారు. అలాగే గ్రామంలో ప్రత్యేకంగా మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి అవసరమైన వారికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో దేవుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సత్యవతి, ఈఓపీఆర్‌డీ సీహెచ్.సుగుణాకరరావు, సూపర్‌వైజర్ బి.నారాయణప్పలనాయుడు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



వైద్యశిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

వెబ్‌సైట్‌లో మెరిట్ జాబితా

విజయనగరం ఫోర్ట్: ప్రభుత్వ వైద్య కళాశాల, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రుల్లో ఐదు కేడర్లకు సంబంధించిన ప్రొవిజనల్ మెరిట్ జాబితాను విజయనగరం .ఎన్ఐసి.ఇన్ వెబ్‌సైట్‌లో పెట్టామని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలీల సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్పీచ్‌థెరపిస్టు, బయో మెడికల్ టెక్నీషియన్, ఓటీ టెక్నీషియన్, ఎలక్ట్రికల్ హెల్పర్, ప్లంబర్ పోస్టుల వివరాలు వెబ్‌సైట్‌లో పెట్టినట్లు పేర్కొన్నారు. వీటిపై అభ్యంతరాలు ఉంటే 30వతేదీలోగా తెలియజేయాలని సూచించారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేలా తనిఖీలు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గాదె శ్రీనివాసులనాయుడు

విజయనగరం అర్బన్: విద్యా ప్రమాణాలను మెరుగుపరిచే విధంగా అధికారుల తనిఖీలుండాలే తప్ప.. ఉపాధ్యాయులను నిందితులుగా నిలబెట్టే విధంగా ఉండకూడదని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గాదె శ్రీనివాసులనాయుడు అన్నారు. సోమవారం స్థానిక పీఆర్‌టీయూ సంఘ కార్యాలయంలో జరిగిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తరగతి గదిలోని విద్యార్థులందరి అభ్యసనా సామర్థ్యాలు ఒక్కలా ఉండవని.. అధికారులు ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకోకుండా ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవడం సరికాదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అసమానంగా ఉండే విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలతో శతశాతం ఉత్తీర్ణత సాధించడం సాధ్యం కాదన్నారు. తరగతి గదిలో అందరి విద్యార్థుల స్థాయి కాకుండా.. పరిమిత విద్యార్థుల సామర్థ్యాన్ని పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అప్పుడు కూడా సరిపడా సామర్థ్యం కొరవడితే, అక్కడి ఉపాధ్యాయులకు మరొక అవకాశం ఇవ్వాలని సూచించారు. ఇలాంటి చర్యలు చేపడితే ఉపాధ్యాయులు మరింత ఉత్సాహంగా పనిచేస్తారని, తద్వారా విద్యాప్రమాణాలు మెరుగుపడతాయన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శ్రీనివాసరావు, అధ్యక్షుడు వి.రవీంద్రనాయుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బంకపల్లి శివప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి రెడ్డి భాస్కరరావు, రాష్ట్ర కౌన్సిలర్ ఆర్.శ్రీనివాసరావు, అర్బన్ ప్రధాన కార్యదర్శి చిట్టి రామినాయుడు, రూరల్ అధ్యక్షుడు రెడ్డి గణపతి, గంట్యాడ మండల ఉపాధ్యక్షుడు సీహెచ్.రమేష్, తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ బోర్డు క్యాంప్‌లపై సమీక్ష



అధికారులతో సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం రూరల్: అర్హత ఉండి ఆధార్ కార్డులో సాంకేతిక సమస్యలతో వృద్ధాప్య పింఛన్లు పొందలేని వృద్ధుల కోసం మెడికల్ బోర్డుల ద్వారా ధ్రువపత్రాల మంజూరుపై సంబంధిత అధికారులతో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సమీక్ష సమావేశం నిర్వహించారు. సోమవారం తన కార్యాలయంలో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ అనీలా సునందని, జెడ్పీ సీఈఓ కె.రాజ్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ ఎ.కల్యాణ్ చక్రవర్తి, వైద్య సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అర్హులైన వృద్ధులు సాంకేతిక కారణాలతో పింఛన్లు పొందలేకపోతున్నారన్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సూచన మేరకు మెడికల్ బోర్డులు ఏర్పాటు చేసి, అవసరమైన వారికి అర్హతలు కల్పించాలన్నారు.